# సుందరమ్మ వీధి

గొట్టాం పాంటు వేసుకుని, మోకాలి క్రింద వరకూ బురఖాలా చొక్కాలు తొడుక్కుని సైకిలుమీద ఏ కాలేజీ టిక్కు టిక్కు టక్కులాడినేనా ఇంటివరకూ దిగబెట్టి వచ్చేవారేమో అక్కడ ఏదో చిన్న సన్మానంలాటిది జరిగివుంటుంది మీకు... అందుకని "సుందరమ్మ వీధి" అంటే అంత కోపం. మీరు వెళ్ళరు సరిగదా రిక్షావాడిని కూడా ఆ వీధిని వెళ్ళనివ్వరు. అక్కడ ఏదో పెద్ద పోట్లాట కాని కొట్లాటగాని జరిగివుంటుంది చిన్నప్పుడు. అంటే ఆ రోజులలో పైలా పచ్చీసుగా కాలేజీలో చదువుకునే రోజులలో- అమ్మాయి లంతా అందంగా వుంటారని అబ్బాయిలంతా బావుంటారని అనుకునే రోజులలో - పురుళ్లూ, పుణ్యాలూ బోలెడు అద్దెలూ, గంపంత సంసారమూ, అరువియ్యని షావుకార్లు, హోదాలు, అంతస్తులు ఇవేవీ తెలియని అమాయకపు రోజులలో లాంతరు స్తంభాలు సినిమా వాలుపోస్టర్లు పత్రికలు, పుస్తకాలే ప్రపంచం అనుకునే రోజులలో ఏ అందమైన అమ్మాయి మొహమేనా ఆకర్షిస్తే సైకిలు వెనకాలే తొక్కుకుంటూ మీరు వెళ్ళారనుకోండి. వెళ్ళితే తప్పేముంది? చిన్న ఈలపాటో పిసరంత జోకో వేశారనుకోండి సుందరమ్మ వీధిలో ఆ సుందరాంగి అన్నగారో బాబాయో సిన్మాలో విలనులా బయటకొచ్చి మీ చొక్కా పట్టుకున్నాడనుకోండి. ఆ టిక్కు టిక్కు టక్కు లాడి తమ్ముళ్ళు మీ సైకిలు చక్రాల గాలి విప్పేసుంటారు దాన్తో మీ చక్ర భ్రమణం వక్ర భ్రమణమయి వుంటుంది.

తదనంతరంబ-ఎందుకు లెండి యిదంతా నా ఊహాగానం;

తరువాత తెలిసింది - మీరు చెప్పకపోయినా "సుందరమ్మ వీధి" లో జరిగిన సంగతి.

మీలాంటివాళ్ళకి కావలసిందే లెండి శాస్తి -

బెజవాడలోని ప్రతిసందు మొగను,సెంటరును, ఆఖరికి కిళ్లీ కొట్లను కాఫీ హోటళ్ళను, తెగపొగిడి స్మృతి చిహ్నాలుగా నక్కదొసకాయలను, గోంగూరను కొరివికారాన్ని రైల్లో ఢిల్లీకి చేరవేసే ఆంధ్రధీర వీర పురుషులు మీరు - "సుందరమ్మవీధి" అంటే మండి పడతారెందుకు అనుకునేదాన్ని. బెజవాడలోని పుస్తకాల షాపులను, పత్రికలను పాత పుస్తకాల బడ్డీ దుకాణాలను పేరు పేరు వరుసగా ప్రస్తుతించి కీర్తించే మీరు, ఊరిని అంతా కలిపి మెచ్చుకుంటూ అందులో మళ్ళీ ఒక వీధిని బహిష్కరించడం అదైనా తగినంత కారణం లేకుండా... నాకు అనుమానం కలిగింది. కాని బక్క చిక్కిన గోవులా సాధువులా ఎంత విశాల హృదయులైనప్పటికీ పిరికి గుండె జోకొట్టని అంతరాత్మకల మీరు ఆడపిల్ల గొడవల్లో పడరని పైదంతా నారీ సహజమైన అనుమానమూ అపవాదమేనని నాకుతెలుసు; ఆ జరిగిన కథ విన్నాక అలా జరగకూడదనిపించింది. ఎలా జరగకూడదో అలా జరిగి తీరుతుంది గ్యారంటీగా -

విధిని దాట వశమా- హా! హా! హా! అసలు బెజవాడలోనే మనుష్యులు సరిగా మాట్లాడరు. మర్యాద మన్ననా చాలా తక్కువ, కసిరి కొట్టినట్లు మాట్లాడుతారు.

మన ఊరేగా - ఇక్కడేగా ఈ బెజవాడలోనేగా మనం పుట్టి పెరిగిందీ? మన ఊళ్ళో మనల్ని గౌరవంగా చూడకపోతే ఏం? తలకాయ వంచుకుని వెళ్ళిపోతే సరిపోయేదానికి తగూలు తెచ్చుకోవడం దేనికి?

కాదు అదేం కాదు. జరిగిన సంగతి వేరు.మీరు చెప్పకపోయినా మి ప్రియమిత్రుడు హాస్య నటుడు "సుబ్బారావు" గారే నాకీ స్టోరి అంతా చెప్పి నవ్వించాడు.

హాస్యనటుడు సుబ్బారావుగారు కొత్త ఢిల్లీలో మనం వుండే వినయనగరంలో బి/71 సి/125 పి/891లో ఏదో ఒక కొంపరాజంలో ఒంటి గదిలో వుండే రోజులలో చిలక పెళ్ళాన్ని (పెళ్ళాన్ని చిలక అంటూ వుండేవాడు. ఆవిడ పళ్ళూ, కాయలు, పచ్చికూరలూ తిని బతకాలిట హాస్యనటుడి భార్యగా పుట్టినందుకు) ఇంట్లో వదిలేసి రెండు మూడు రోజులకోసారి ఇంటికివచ్చి పలకరించి వెళ్ళేవాడట. వెంకట సత్యవతి చాలా అమాయకురాలు. తెలుగు తప్ప హిందీ, ఇంగ్లీషు వగైరాలు ఏమీ రావు. డబ్బులుకూడా యింట్లో వెతికినా కనిపించేవి కావుట. బియ్యం, ఉప్పు, పప్పు లేకుండా ఏకాదశి వ్రతాలుచేస్తూ హాస్యనటుడి భార్యగా యింట్లో ఏడుస్తూ దీనంగా రోజులుగడిపే సత్యవతికి హిస్టీరియా ఫిట్టొచ్చి గదిలో పడిపోయి వుందట. అప్పుడు మీరెందుకోవెళ్ళి మీ శిష్యునికోసం కేకేస్తే అంతావచ్చి తలుపులు తీసిచూస్తే ఈ అమ్మాయి ఫిట్టొచ్చి పడిపోయి నాలుక కొరుక్కున్నందువల్ల మూతంతా ఎర్రగా అయిపోయిందట. ముందు పలువరస కూడా దెబ్బతిని రక్తం కారుతోందట. హాస్యనటుడు సుబ్బారావుగారు రిహార్సల్సులో ఎక్కడో యితరులను నవ్వించడం కోసం కుస్తీ పడుతున్నారట. ఇంట్లో చిల్లుకాని లేదట. మీరు వెంటనే ఆ వెంకట సత్యవతిని కటాక్సీలో వేసుకుని రైల్వే ఆసుపత్రికి తీసుకెళ్ళి "నా భార్య ఫిట్టు వచ్చి పడిపోయిందని చెప్పి వైద్యం చేయించారట. హాస్యనటుడు సుబ్బారావుగారు మందు సీసా పుచ్చుకుని ఫలానావారి భార్యకి మందివ్వండీ అని చెప్పి తన పెళ్ళానికి మందు తెచ్చుకునేవాట్ట ఆవిడకు రోగం కుదిరింది కాని ఆ ముందుపళ్ళు విరిగి నందుకు మొహంవికృతంగా కనిపించేదట. నవ్వినపుడు పగిలిన పళ్ళు బయట పడతాయని ఆ అమ్మాయి పాపం నవ్వటం మానుకుందిట. మనం యిద్దరం నవ్వితే ఎల్లాగ నేను నవ్వుతాను నవ్విస్తాను నువ్వు నవ్వకు అని సుబ్బారావు సత్యవతిని సమదాయించేట్ట. మళ్ళీ ఇంకోసారి ఢిల్లీ నుంచి బయటపడేందుకు రైలు టిక్కట్టుకి డబ్బులు లేకపోతే ఆ హాస్యనటుడికి భార్య పేర ప్యాసు యిచ్చిఫ్రీగా ప్రయాణం ఏర్పాటు చేశారట మీరు. ఆ వెంకట సత్యవతి మేము సుందరమ్మ వీథిలో వుంటున్నాము మా యింటికి తప్పకుండా రావాలి అన్నగారూ అని మీ చేత ఒట్టేయించుకుందిట. మీ భార్యనని చెప్పుకుని ఆ అమ్మాయి ప్రయాణం చేసింది.

హాస్య నటుడి భార్య అంటే మీకు చాలా జాలి. అందుకని మీరు బెజవాడ వచ్చినపుడు సుందరమ్మ వీథికి వెళ్ళి తిన్నగా సుందరమ్మ గారింటికే వెళ్ళి చి॥ సౌ॥ వెంకటసత్యవతిని గురించి వాకబు చేసేరట;

మీకు బొత్తిగా ప్రపంచ జ్ఞానం లేదండీ. సుబ్బారావుగార్ని గురించి అడక్కుండా అమాయకంగా వెంకట సత్యవతిని గురించి అడిగి, చూడాలని పిలవండి అంటారా ఎక్కడన్నా...

ఇది ఆంధ్రదేశం. అందుకే సుందరమ్మగారు చేతులు తిప్పుకుంటూ వచ్చి- "నాయనా నువ్వు మా అల్లుడి స్నేహితుడివే కావచ్చు కాని - ఆ అబ్బాయి వచ్చినప్పుడు కూడారా- అంతే కానీ పరాయి వాడి పెళ్ళాన్ని చూడ్డానికి తగుదునమ్మా అంటూ వచ్చేవా; మాదేమి అలగా కుటుంబం కాదు. వెళ్ళు; వెళ్ళు; నీకు తెలీదేమోకాని. అలా మా అమ్మాయిని పేరెట్టి పిలిచి చూస్తారమ్మంటే నీ ఎదురుగుండా వచ్చి నిలబడుతుందనుకున్నావా? సిగ్గు సిగ్గు;" అని తలుపులు భళ్ళున వేసుగుందిట మొహం మీద.

ఈ స్టోరీ అంతా చి॥సౌ॥ వెంకటసత్యవతి మొగుడే నాకు చెప్పి నన్ను తెగ నవ్వించేడు.

నిజమేఁ హాస్యనటుడు అందర్నీ నవ్విస్తుంటే అతగాడి భార్య పరోక్షంగా మిమ్మల్ని ఏడిపించడం జాలి కథే. చార్లీ చాప్లిన్ తీసే హాస్యనటుడి స్నేహితుడి జాలి కథలా వుంది.

అందుకా మీరు "సుందరమ్మ వీథి" అంటే మండిపడతారు? పాపం - వెరీ సారీ అండి;

# డబ్బు ఖర్చు రైల్వే

డబ్బు ఖర్చు రయిల్వే ధర్మమా అని అరకు వేలీలో అయిదేళ్ళు అరణ్య వాసం అజ్ఞాత వాసం చేశాము. అక్కడ పళ్ళు తెగ తినొచ్చని పాలు ప్రవహిస్తాయనీ బేవార్సుగా లైఫ్ ఈజీగా గెటాన్ కావచ్చనీ, పరుగులెత్తుకు వచ్చినవాళ్ళు పూర్‌మేన్స్ ఊటీలో దోస్ తిన్నారు. అయితే అరకు వేలీపేరు చెప్పగానే చింతపండూ చీపురుకట్టలూ. పనస పళ్లూ - పొట్టి సెట్టి, బాబూరావు కిల్లీ కొట్టు త్రినాధు పెసరట్టు పంతులు హోటలూ - చచ్చిపోయినతాసీల్దారు గారూ, ఎప్పుడూ కుంటుకుంటూ తిన్నగా నడవని "కోపరేటి బస్సు - ఎక్కడా ఆగని రాందాసూ. డాక్ రన్నరు మరియూ మాజీ పోలీసు కనిస్టేబు సాంబమూర్తి పేషంట్లను పేషన్స్ లేకుండా బండబూతులు తిట్టిచందాలు పోగుచేసి శ్రీనివాసుడికి గుడి కట్టించిన పులి మీసాల పెద్ద డాక్టరూ. స్మశానం పక్కనే వున్న ఆసుపత్రిలో డ్రామాపోర్షన్లు కంఠతాపట్టే డ్రెస్సరూ అరివీర భయంకరుడు అజగాంకరుడు, ఆవుకన్నా సాధువైన ఆవుల రామిరెడ్డి గారూ, అరవంకంటె తెలుగు బాగా వచ్చినా అరవ పితలాటకాలుపెట్టందే ప్రాణం ఒప్పని హమేషా బ్లడ్ ప్లెషరు కృష్ణన్, ఎందరి తలల్లోనో నాలుకలా తిరిగే మీ ప్రియ శిష్యుడు మీరు చెప్పని వన్నీ స్టేజీమీద చేసి చూపించే పొట్టి పంతులూ, ఎన్నెన్నో స్మృతులు దొంతరలు దొంతరలుగా వచ్చి మనసును తట్టి లేపుతాయి.

ఆ అడవి ఊళ్ళో మీరో చిన్నసైజు హీరో-అందుకే అక్కడ వున్న నాలుగైదేళ్ళూ మీరాడింది ఆటా-పాడింది పాటా; మీ చిట్టి చిట్టి అలకలూ పొట్టి పొట్టి కోపాలూ తీర్చలేక శతమతమై పోయేవారు మీ గేంగు.